# రూపాయి చిల్లర

రూపాయకు కాగతంమీదేకాని యితరత్రా విలువేమీ లేదు. వాస్తవమే- ఆ రూపాయినోటు మీద జార్జి రాజు బొమ్మ, ప్రభుత్వ ఆర్థిక విభాగ కార్యదర్శి సంతకం, ఎనిమిది భాషలలో, అంకెలలో, దాని మూల్యం, రూపాయి నాణెం బొమ్మ, యింకా చిత్రవిచిత్రా లెన్నో ఉంటాయి. కాని దాన్ని మార్చడంలో ఎంతైనా కష్టముంది.

నాది బానిసబ్రతుకు. ఉదయం ఆరున్నర గంటలకు బస్సులో పడితేనేకాని ఏడు గంటలకు ఆఫీసుకు చేరుకోలేను. నా దినవ్యయానికి పరిమితి ఒక రూపాయి మాత్రనే.

బస్సులో ప్రవేశించి యిరువురు స్థూలకాయుల మధ్య యీ ఎముకలుగూడును జాగ్రత్తగా చేర్చి స్థిమితపడేలోగా 'టికెట్స్' అని అంటూ కండక్టర్ మీదకొస్తాడు.

జేబులోంచి పర్సు లాగి ( ఆ రూపాయి కొరక పర్సు తప్పదు) చిరిగిపోతుందేమోనన్న భయంతో పదిలంగా ఆ రూపాయి నందిస్తాను. దాన్ని చూడగానే కండక్టర్ పెదవి విరుస్తాడు. "అంతా రూపాయిలే ఇస్తారు. ప్రొద్దున్నే చిల్లర యెక్కణ్ణుంచి వస్తుంది?" అని మూలుక్కుంటూ రెండణాల టిక్కెట్టొకటి పర్రున చించి, ముక్కుమీదకు విసిరేసి, అటు తిరుగుతాడు. చిల్లరమాత్ర మీయడు.

ఊరుకుంటే చిల్లరమాట మర్చిపోతాడేమోనని భయం. అడుగుదామంటే 'అంతా రూపాయలే ఇస్తున్నా' రన్న మానవుడు చిల్లర లేదని మండిపడతాడేమో నని మరొక భయం. ఉన్న దొక్క రూపాయే ఆయె!

సాహసించి 'చిల్లర' అని నసుగుతాను. గబుక్కున పక్కకు తిరిగి "ఇలా తిరిగి వచ్చేప్పు డిస్తా" నంటూ కండక్టర్ ముందుకు పోతాడు. ఇంక ఊరుకోవలసిందే- మాట్లాడ్డానికి వీలులేదు. ఒక్కటే ఆశగా ఉంటుంది. ఇంకా రూపాయ లిచ్చిన పెద్దమనుష్యు లున్నారుకదా- అంతా అడిగినప్పుడు నేనూ అడగవచ్చునులే అని సరిపెట్టుకుంటాను.

కండక్టరు తిరిగివస్తాడు. దారిలో ఇద్దరికి చిల్లర ఇస్తాడు కూడా. కాని నావైపు చూడనైనా చూడకుండా వెళ్ళిపోతూ ఉంటాడు. నాకేమో అతనిమీదే దృష్టాయెను!

ఇక భరించలేక "మరి నాచిల్లర..." అంటూ జ్ఞాపకం చేస్తాను.

"చిల్లరలేదండీ! కావలిస్తే నోటు తీసుకుని రెండణాలు ఇయ్యండి!" అంటూ ఆ నోటునే నాకు తిరిగి ఈయబోతాడు.

నా దగ్గర రెండణాలుకాని, అంటే మానసికంగా ఇంతవ్యథ పడవలసిన అవసర మేమిటని మనస్సులో అను కుని, లేని చిరునవ్వు తెచ్చిపెట్టుకుని "సరే తరువాత ఈయ వచ్చునులే" అంటాను. కాని ప్రాణమంతా దానిమీదే.

అతడు తనస్థానం దగ్గరకుపోతూ, నాకు వినపడీ విన పడనట్లుగా ఎవరితోనో "ఇదే బాధయ్యా రోజూనూ, చిల్లర

ఎక్కణ్ణుంచి వస్తుంది? రెండణాలైనా ఉండవు. రూపాయ నోట్లు మీద పారేస్తారు" అంటూ ఏదో చెబుతూ ఉంటాడు.

కొంపతీసి ఆ రూపాయని తినెయ్యడుకదా అని మనస్సు పీకుతూ వుంటుంది. లేకపోతే చిల్లరకోసం ట్రాన్స్పోర్టు ఆఫీసుకు రమ్మంటాడా అనే భయంకూడా వేస్తుంది.

పదినిమిషాలు గడుస్తాయి. నా ప్రయాణ పుణ్యకాలం పూర్తవుతుంది. అతడేమిటో మహా హడావిడిలో ఉంటాడు. ఇక దిగి పోవాలి. బస్సు ఆగబోతూఉంటే గట్టిగా "కండక్టర్! చిల్లర..." అని అడుస్తాను.

"దేనికి చిల్లరండీ!" అంటా డతడు.

"ఇందాక రూపాయి ఇచ్చాను. టిక్కెట్టు ధర రెండణాలుపోను మిగిలిన పధ్నాలుగణాలు..." అని లెక్క పూర్తిగా చెబుతాను.

"మరి ఇంకా యిలా తిరిగివస్తూంటే ఎందుకడిగారు కారు?" అని ప్రశ్నిస్తూ అతడు నాకేసి అనుమానంతో చూస్తాడు.

కొంప నిజంగానే ముంచాడు. నేనే దొంగవెధవ ననడుకదా అని కాళ్ళు వణుకుతున్నాయి.

పోనీ పోదామంటే మన దొంగతనం రూఢయినట్లే. అయినా వున్న రూపాయి ఒకటే అయినప్పుడు ఎలా పోవడం?

"ఇందాక అడిగానయ్యా! చిల్లర లేదన్నావు" అంటే—"లేకపోవడ మేమిటండీ!" అని సమాధానమిచ్చి ప్రక్క

నున్నవారికేసి సాభిప్రాయంగా చూస్తూ "రూపాయి ఇచ్చి నప్పుడు చిల్లర అడగద్దుటండీ?" అంటాడు.

బస్సు ఆగుతుంది, దిగిపోవాలి. చిల్లరేమో దొరికింది కాదు. చేతకానితనంవల్ల ఉక్రోషం వస్తుంది.

అప్పటి కాతడు కనికరించి, మూలుగుతూ దగ్గర కొచ్చి ఎలాగో చిల్లర పడేస్తాడు. పైగా "సరిగా లెక్కపెట్టు కోండి- మళ్ళీ తక్కువయిందంటే నావల్ల కాదు" అని హెచ్చ రిస్తాడు.

చిల్లర లభించిందన్న ఆనందంతో ఈ అంతిమ బాణా నికి లెక్కచేయకుండా బస్సు దిగిపోతాను.

రూపాయను అణాలలోనికి, అణాలను పైసలలోనికి మార్చుకుని, దినాన్ని గంటలలోకి, గంటలను నిమిషాల లోనికి, నిమిషాలను క్షణాలలోనికి మార్చగా వచ్చిన సంఖ్యకు, దానికి లంగరు కుదరక అవస్థపడే నాకైతే రూపాయ విలువ చాలాఉంది.

నేనేకనుక హిజ్ మెజెస్టీస్ సర్వీసుకు చెందిన 'రెండేవో' యుద్ధనౌకలోని ఉద్యోగినైతే రూపాయనిచ్చి, కండక్టర్ చిల్లర తిరిగి ఈయబోతే తెల్లబోయి చూస్తాను.

—o—